


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 24 పుష్పం : 51-52 05-9-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 24

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 13-04-04, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం గృహస్థుగా ఉన్నప్పడు గృహస్థధర్మం పాటించాలి, సన్యాసం తీసుకొంటే సన్యాసధర్మం పాటించాలి. మనం ఏ ఆశ్రమంలో ఉంటే ఆ ఆశ్రమధర్మం పాటించాలి. మనకు గృహస్థాశ్రమంలోకొన్ని ఆటంకాలు వస్తాయి, సన్యాసాశ్రమంలో కొన్ని ఆటంకాలు వస్తాయి. ఇలా వస్తున్నాయి ఏమిటి అని మనం అనుకొంటాము కాని భగవంతుడికి తెలియకుండా ఆవిఘ్నాలు రావటంలేదు. మనం రమ్మని వాటిని ఆహ్వానించలేదు అందుచేత పొమ్మని అనవద్దు, ఉదాసీనంగా ఉంటే సరిపోతుంది. దేహప్రారబ్దాన్ని బట్టి ఆవిఘ్నాలు వస్తూఉంటాయి. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి మనపని మనంశ్రద్ధగా చేసుకొంటే మనకు మోక్షం కలుగుతుంది. గుణాలువచ్చి మననెత్తిమీదపడుతూ ఉంటాయి. ఆగుణాలు వచ్చినప్పటికి కూడా ఎవడైతే నిర్గుణంగా ఉండగలుగుతున్నాడో, ఎవడైతే వికారం లేకుండా ఉండగలుగుతున్నాడో వాడు ఆత్మజ్ఞానం పొందటానికి అర్హుడవుతాడు. మనం ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి ఎందుచేతనంటే మనం తినేఆహారం యొక్క ప్రభావము శరీరం మీద, మనస్సు మీద ఉంటుంది. మా గ్రహస్థితి బాగాలేదు అని చాలామంది చెపుతూఉంటారు. గ్రహస్థితి బాగాఉన్నా, బాగాలేకపోయినా అది దేహానికి సంబంధించిన విషయమే. ఈదేహం పుడుతుంది,

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగహ్రభాషణములు


13-04-04 భీమవరం ........ 1
08-008-04 జిన్నూరు ........ 8





Visit us @ www.srinannagaru.com


పెరుగుతుంది, చనిపోతుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు, దాని తాలుక వికారములన్నీ మనస్సులోనికి రానివ్వవద్దు. మనంపొందవలసింది మన హృదయంలోనే ఉంది, అదేసత్యం, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే మన జీవితగమ్యం. మనలను పీడించే గ్రహం మన అహంకారమే, మన మనస్సు మన స్వాధీనంలో ఉంటే, మనకు ఇంద్రియనిగ్రహం ఉంటే, మనం శాంత చిత్తం కలిగిఉంటే ఏగ్రహాలు మనలను ఏమీ చేయలేవు. నిజమైన స్నేహితుడు మనకు ఎలా సహకరిస్తాడో, స్వాధీనమైన మనస్సు మనకు అలా సహకరిస్తుంది. మన శత్రువులు మనలను ఎలా ఇబ్బంది పెడతారో స్వాధీనంలోలేని మనస్సు మనలను అలా ఇబ్బంది పెడుతుంది. బంధానికి, మోక్షానికి మన మనస్సే కారణం. అందుచేత మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కాపాడుకొంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ, మంచిగ్రంధాలు అధ్యయనం చేస్తూ, జపతపములు తోటి జీవితం గడుపుతూ, నీ బాధ్యతలను ఆసక్తిలేకుండా నిర్వర్తిస్తూ ఉంటే మనకు మోక్షంకలుగుతుంది. మనం మనస్సు అనే గ్రహం నుండి విడుదలపొందితే బయటగ్రహాలు మనలను ఏమీ చేయలేవు. అందుచేత మనస్సును నియమించుకోవాలి, మనస్సును మిత్రుడుగా చేసుకోవాలి, మనస్సును స్వాధీనం చేసుకొనే ప్రయత్నంచేయాలి. మనం సత్కర్మ చేస్తూ కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఉంటే మనమనస్సు జ్ఞానం పొందటానికి సమాయత్తం అవుతుంది, ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. ఎలక్షన్‌లో నిలబడినవారు నెగ్గటానికి రాత్రి అనక, పగలు అనక ఎంత కష్టపడతారోచూడండి, మరి మనం ఈ జననమరణ చక్రం నుండి బయటపడటానికి ఎంత ప్రయత్నంచేయాలో ఆలోచించుకోండి. మనకు మోక్షం పొందాలి అని ఉంది, కాని దానికి తదనుగుణంగా సాధనచేయటం లేదు, ప్రయత్నం చేయటం లేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మిధ్యానేను నుండి విడుదలపొందాలి, అదే మనజీవితగమ్యం. ఈమిధ్యానేనులో నుండి విడుదలపొందటానికే సదాచారం, సద్గుణాలు ఇవి అన్నీ పెట్టారు. మనస్సుకు లోచూపురావటానికి, వివేకంపెరగటానికి, జీవితాన్ని సరిదిద్దుకోవటానికి, మధ్యేమార్గంలో ప్రయాణం చేయటానికి భక్తి అవసరం. భక్తి లేకుండా ముక్తి కలుగదు. భక్తిని ఆలంబనగా చేసుకొని జ్ఞానాన్ని సంపాదించు అని ఆచార్యులవారు చెప్పారు. వారిమీద, వీరిమీద నువ్వుకోపం తెచ్చుకోవటం కాదు, నీకోపం మీద కోపం తెచ్చుకో అన్నారు భగవాన్. రామచంద్రమూర్తికి అన్నీ కళ్యాణగుణాలే. మనం కళ్యాణ గుణాలను ఎందుకు అలవర్చుకోవాలి అంటే, కళ్యాణగుణాల వలన కోపం తగ్గుతుంది, రాగం తగ్గుతుంది, భయంతగ్గుతుంది, వివేకం పెరుగుతుంది, విచక్షణ పెరుగుతుంది. బ్రహ్మం ఎక్కడో ఉంది

అనుకొంటున్నారు బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది. అది ఎప్పుడో తెలుస్తుంది అనుకొంటున్నావు కాని ఇప్పుడే తెలుస్తుంది, నీవు గుణాలనుండి విడుదలపొందితే, మనోనాశనమైతే ఇప్పుడే, ఇక్కడే బ్రహ్మంనీకు అనుభవంలోనికి వస్తుంది. ఇప్పుడు నేను శాంతిగా ఉన్నాను అనుకోండి, ఈశాంతికి బాహ్యకారణాలు ఏమీ కన్పించటంలేదు అనుకోండి, అది నిజమైనశాంతి, బాహ్యకారణాల వలన నీకు శాంతి వస్తూఉంటే భవిష్యత్‌లో అదిఅంతా అశాంతి కింద మారిపోతుంది. శరీరానికి కంఫర్టు ఎంతముఖ్యం అనుకొంటున్నావో మనస్సుకు నిగ్రహం కూడా అంతే ముఖ్యం. మనస్సుకు నిగ్రహం లేకపోతే దానికిలోచూపు రాదు, లోచూపు లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. మనకు అనేక సంకల్పాలు వస్తూఉంటాయి, మనసంకల్పం జరుగదు, ఈశ్వరసంకల్పం జరుగుతుంది. ఏప్రారబ్దం అనుభవించటానికి భగవంతుడు మన దేహాన్ని ఇక్కడకు పంపించాడో, ఏ సంకల్పంతో ఇక్కడకు పంపాడో ఆ సంకల్పానికి మనం సహకరిస్తూ ఉంటే మనకు ఈజన్మలోనే మోక్షంకలుగుతుంది, ఈశ్వరసంకల్పాన్ని గౌరవించేశక్తి నీకు కలుగుతూ ఉంటే ఈ జన్మలోనే తరిస్తావు, సాధన వలన ఈశ్వరసంకల్పాన్ని విశ్వసించే శక్తి నీకు కలుగుతుంది. నాకు సన్మానాలు ఎవరుచేస్తారు, నన్ను ఎవరు గౌరవిస్తారు అని కనిపెట్టుకొని ఉంటే వాడికి జ్ఞానంరాదు, వాడికి దేహబుద్ధి పెరుగుతుంది, రజోగుణం పెరుగుతుంది. ముందు మనం రజోగుణాన్ని, తమోగుణాన్ని తగ్గించుకోవాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసుచేయాలి, సత్వగుణాన్ని ప్రాక్టీసుచేయగా చేయగా ఆగుణంలో నుండి విడుదలపొందుతాము, అప్పడు నిర్గుణస్థితి మనకు కలుగుతుంది. అగ్నికి నెయ్యి ఆహుతిచేసేకొలది అది పెరుగుతూ ఉంటుంది అలాగే భోగాలను అనుభవించేకొలది భోగం పెరుగుతుంది. నీకు ఇక్కడ అనుభవించే భోగాలు సరిపోవటంలేదు, చనిపోయిన తరువాత కూడా భోగాలు అనుభవించాలి అని స్వర్గలోకం కోరుకొంటున్నావు. ఇదంతా నీలోపల ఉన్న అజ్ఞానానికి గుర్తు. నీవు స్వర్గలోకానికి వెళ్ళాలి అనుకొంటున్నావు, ఆ వెళ్ళేవాడు ఎంతనిజమో స్వర్గం కూడా అంతేనిజం. నీ జీవితగమ్యం అదికాదు. జీవితానికి మరణానికి బేధం తెలియని స్థితిని పొందాలి, ఆస్థితిని పొందటానికి నీవు కనీసం ప్రయత్నం చేయటంలేదు. నీవు కోరిక పెట్టుకొని ఏదైనాపనిచేస్తే ఫలితం రావచ్చును, ఆఫలితాన్ని అనుభవిస్తే అదిపోతుంది. ఆఫలితాన్ని అనుభవించేటప్పడు వాసనపడుతుంది, వాసనలో నుండి తలంపు వస్తుంది, ఆ తలంపును బట్టి మరల పని చేస్తావు. ఇది అంతా కర్మచక్రం. ఈశ్వరానుగ్రహం ఉంటేగాని ఈచక్రంలో నుండి విడుదలపొందలేము. ఈదేహం కేవలం భోగం అనుభవించటానికి కాదు, తపస్సుకు ఈ దేహాన్ని ఉపయోగించుకొని అమృతానుభవంనుపొందు, జీవితానికి, మరణానికి బేధంలేని స్థితిని అందుకో. ఎప్పటికైనా నిష్కాముడు పవిత్రుడు అవుతాడు, వాడికి మోక్షానికి వెళ్ళేదారి తెలుస్తుంది కాని సకాముడికి తెలియదు. కర్మఫలంపట్ల వాంఛవద్దు. నువ్వుకోరకుండా వచ్చిన ఫలితం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది కాని చిత్తాన్ని అపవిత్రంచేయదు. ఆచార్యుల వారు ఏమిచెపుతున్నారు అంటే ఉన్నదేదో నీ హృదయంలోనే ఉంది, అది నీకు అనుభంలోనికి రావాలి. దానికి నీ మనస్సు యొక్క చాపల్యం తగ్గాలి. ఒక రూపాన్ని ఆరాధించినా, ఒకనామాన్ని జపించినా మనోనిగ్రహంకోసమే. నియమింపబడిన మనస్సుకు గాని లోచూపురాదు. లోచూపువస్తేగాని హృదయంలో ఉన్న సౌందర్యం తెలియదు అంటున్నారు. మనం భగవంతుడు చెప్పిన మాటలను ఏదో వింటున్నాము, ఇలా వింటే సరిపోదు, వాటిని మననంచేసుకోవాలి, వాటిని నీ మనస్సులో రాపాడించుకోవాలి. అలా మననంచేసుకోగా చేసుకోగా అది మనకు అనుభవంలోనికి వస్తుంది. ఏదైతే మనకు అనుభవంలో ఉందో అది మనకు సుఖాన్ని తీసుకొని వస్తుంది కాని మనకు అనుభవంలో లేనిది మనకి సుఖాన్ని తీసుకొనిరాలేదు. ఇతర జీవులకు లేని అవకాశం మానవజన్మకు ఉంది. పశువులు నిద్రపోతున్నాయి, మనం నిద్రపోతున్నాము, అవి ఆహారం తింటున్నాయి, మనమూ తింటున్నాము, వాటికి భయంవేస్తోంది మనకూ భయంవేస్తోంది కాని మనకు భగవంతుడు తెలివిని, వివేకాన్ని ఇచ్చాడు. ఆతెలివిని మనం భగవదనుభవంపొందటానికి ఉపయోగించుకోవాలి. మానవజన్మరావటమే కష్టం, మానవజన్మవచ్చిన తరువాత ముముక్షత్వంరావటం కష్టం, నీకు మోక్షాపేక్ష కలిగినా తదనుగుణంగా జీవించటానికి సహకరించే మహాత్ములు దొరకటం కష్టం. మనం పూర్వజన్మలో ఎంతోకొంత సత్కర్మచేసిఉంటేగాని, నిష్కామకర్మచేస్తేగాని సత్పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధినీకు కలుగదు. నాకు మోక్షం కావాలి, మోక్షం కావాలి అని వూరికే అనుకొంటావుగాని సాధనచెయ్యవు, ఎవరిని ఆశ్రయిస్తే మోక్షం తాలుక అనుభవం మనకుకలుగుతుందో వారిని ఆశ్రయించాలి అనే బుద్ధి నీకులేదు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని ఒకరు భగవాన్‌ను అడిగితే నువ్వు నేను, నేను అంటున్నావు కదా, అదే మూలతలంపు, ఆమూలతలంపు మూలంలోనే ఈశ్వరుడు ఉన్నాడు. వాడేనిజం, మిగతావన్నీ కల్పితాలు. ఆమూలతలంపును ఉపసంహరించి, ఉపసంహరించి వివేకాన్ని, వైరాగ్యాన్ని ఉపయోగించుకొని మూలతలంపును దానిమూలంలో ఉంచగలిగితే అదినశిస్తుంది. అది నశిస్తే నీవు నశించవు, నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

బ్రాహ్మీస్థితిని పొందు అర్జునా అని కృష్ణుడు అర్జునుడితో చెపుతాడు. బ్రహ్మం యొక్క స్వరూపం సుఖం, శాంతి, ఆనందం. బ్రాహ్మీస్థితిని పొందకుండా దాని తాలుక సుఖం, శాంతినీకు అందదు. బ్రాహ్మీస్థితిని పొందటానికి మనకు ఉన్న శక్తిని, యుక్తిని, భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములన్నింటిని ఏకముఖంగా ఉపయోగించుకోవాలి. అప్పడు మనం ఆవస్తువును పొందగలము. ఇక్కడ మనకు ఎవరికి మరణించాలని లేదు ఎందుచేతనంటే ఏ వస్తువుకయితే మరణం లేదో అది మనమై ఉన్నాము. మనకు ఎవరికి అశాంతిగా ఉండాలనిలేదు ఎందుచేతనంటే ఏవస్తువులో అయితే అశాంతిలేదో అది మనమై ఉన్నాము. మనకు ఎవరికీ దుఃఖం అంటే ఇష్టంలేదు ఎందుచేతనంటే ఏ వస్తువుకయితే దుఃఖం లేదో అది మనమై ఉన్నాము. మనం ఏదిగా ఉన్నామో అది మనం కోరుకొంటున్నాము. సాధన ద్వారా మనలను మనవే అన్వేషించుకొంటున్నాము, మనలను మనం తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు అంటే ఎవరిని తెలుసుకోమని, అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకో. సాధన అంటే ఏమీ లేదు లోపలఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటమే సాధన. బ్రాహ్మీస్థితిని పొందినవాడు ఎవరైనావచ్చి మాట్లాడినా, మాట్లాడకపోయిన అలాగే ఉంటాడు, శరీరం ఉన్నా అలాగే ఉంటాడు, శరీరం పోయినాఅలాగేఉంటాడు, యుద్ధం మధ్యలో ఉన్నా అలాగే ఉంటాడు, ఇంట్లో కూర్చొన్నా అలాగే ఉంటాడు. ఈసృష్టిస్థితిలయాలతోగాని, ప్రకృతికి సంబంధించిన విషయాలతోగాని బ్రాహ్మీస్థితిపొందినవాడికి పనిలేదు. నువ్వు ఏదైతేకాదో అదే నేను అనే భావన గట్టిగా మనకు నాటుకుపోయింది. అది సత్యం కాదు అది అసత్యం. అసత్యంలోనుండి దుఃఖం వస్తుంది. నువ్వు నిజస్థితిలో ఉంటే నీకు దుఃఖంరాదు, నువ్వు అనిజస్థితిలో ఉన్నావు కాబట్టి దుఃఖం వస్తోంది. నువ్వు దుఃఖం వచ్చినప్పడు రావద్దు, రావద్దు అని దానిని రిజెక్టుచేస్తున్నావు ఎందుచేతనంటే నీ స్వరూపంలో దుఃఖంలేదు. మీరు నాలుగువేదాలు చదువుకొన్నారు అనుకోండి, మీ ఇంటినిండా ధనం ఉంది అనుకోండి అన్నీ బాగున్నా మీకు దుఃఖంవస్తోంది అనుకోండి వాటి వలన లాభంలేదు. దుఃఖంవస్తే అది పీడించేస్తుంది, మనస్సులో ఒక విధమైన మంట వచ్చేస్తుంది. అప్పడు నీవు వేదపండితుడవు అయితే ప్రయోజనం ఏముంది? నీకు ధనం ఉంటే ప్రయోజనం ఏముంది? మానవుడు దుఃఖరహితస్థితినిపొందాలి, అది నీహృదయంలోనే ఉంది, దానిని పొందటానికి ప్రయత్నించు. మనం మనోదేహములతో తాదాప్యం వదులుకొన్నప్పడు మనహృదయంలో ఉన్నశాంతి సుఖం పొంగివచ్చి నీసహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పడు ఎటుచూసినాశాంతే, ఎటుచూసినా ఆనందమే. ఈశరీరం భూమిమీద తిరుగుతూ ఉండగానే అటువంటి అనుభవాన్ని పొందటానికి ప్రయత్నంచెయ్యి, నీకు మోక్షం కావాలి అంటే సరిపోదు తదనుగుణంగా నీవు ప్రయత్నంచేయాలి, అధ్యయనం చేయాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి. మీకు ఏదైనా గర్వం తెచ్చుకొనే కారణం ఉన్నా గర్వం తెచ్చుకోవద్దు, అలా గర్వంతెచ్చుకొంటే మరల దానిని పోగొట్టుకోవటానికి అనేక జన్మలు సాధనచేయవలసి ఉంటుంది. కొంతమంది చిన్నమాట అంటేపడరు. చిన్నమాటఅంటే పడలేనప్పడు, ఆ సహించేశక్తి మీకు లేనప్పడు మీకు లోచూపు ఎలా కలుగుతుంది, కలుగనేకలుగదు. అందుచేత మనం నిర్మలంగా, నిశ్చలంగా, కూల్‌గా ఉండాలి. దేహప్రారబ్దాన్ని బట్టి మనకు అనుకూలమైన పరిస్థితులు, ప్రతికూలమైన పరిస్థితులు ఎదురవుతాయి, వాటిని కంప్లీట్‌గా దేహానికి వదిలెయ్యి. నువ్వు ఈ భూమిమీదకు వచ్చిన పని ఏదో అదిచూసుకో, మనకు లోపలఉన్న సద్వస్తువు తెలియకపోయినా దేహము, మనస్సు తెలుస్తున్నాయి కదా, ఈమనోదేహములను ఆత్మజ్ఞానసముపార్జనకు ఉపయోగించుకో అలా ఉపయోగించుకోవాలంటే శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం ముఖ్యం. అవిరెండూ కాపాడుకొంటూ ఆత్మజ్ఞానసముపార్జనకు మనోదేహములను ఉపయోగించుకో, నువ్వు ఏదిగా ఉన్నావో దానిని పొందటానికి మనోదేహములను ఉపయోగించుకోకుండా వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని చిల్లరగొడవలకి, అల్పవిషయాలకు నీ మనోదేహములను ఉపయోగిస్తే జీవితంలో నీవు చాలానష్టపోతావు. ఈశరీరంచనిపోయేలాగ గుణాతీతుడవు అవ్వలేదు అనుకో, నువ్వు ముక్తిస్థితినిపొందలేదు అనుకో, మిగతావి ఏవి సాధించినా అవిఅన్నీ ఒకటిలేని సున్నలతో సమానము.

సాధనఅంటే మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన ఏకాగ్రతను పాడుచేసుకోకూడదు, శాంతచిత్తమును కాపాడుకోవాలి అప్పడు ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. నంది చూపు ఈశ్వరుడు వైపుకు ఎలా ఉంటుందో అలాగ మన చూపు ఎప్పడూ ఈశ్వరుడు మీద ఉండాలి. ఈశ్వరునిపొందటానికి మన సర్వశక్తులు వినియోగించాలి. మనయుక్తి, శక్తి అన్నీ అటే ప్రవహిస్తూఉండాలి. ప్రయత్నం, సహనం ఈరెండింటి వలన నీకు విజయం కలుగుతుంది. సత్పురుషులతో సహవాసం చేయటం వలన భగవదనుభవం పొందటానికి ప్రయత్నంచేయాలనే బుద్ధిమనకు కలుగుతుంది. ఒక మహాత్ముడి సన్నిధిలో కూర్చొంటే ఆయనపొందినది మనకు పూర్తిగా తెలియకపోయినా మనంకూడా పొందాలనే జిజ్ఞాస కలుగుతుంది. భగవాన్ చెపుతూ

ఉండేవారు ఇక్కడకు వచ్చినవారు ఎవరూ వట్టిచేతులతో వెళ్లరు, నాస్తికులు ఆస్తికులు అవుతారు ఆస్తికులు భక్తులవుతారు, భక్తులు జ్ఞానులవుతారు అని చెప్పేవారు. నువ్వు గురువు దగ్గరమాట్లాడేటప్పుడు మధురంగా ఉండాలి, గౌరవంగా మాట్లాడాలి, ఆయన చెప్పినది శ్రద్ధగా వినాలి, విన్నదానినిమననం చేసుకోవాలి, ఆవాక్యాన్ని ధ్యానం చేయాలి, నిరాకారుడూ ఈశ్వరుడే, సాకారుడూ ఈశ్వరుడే అయితే ఆకారం ఎందుకంటే మనకు ఉపాసనకోసం. మనశరీరాన్ని తీసుకొని వెళ్లి ఆయనదగ్గరపెట్టటంకాదు, మనమనస్సును ఆయన మీదపెట్టాలి. మనమనస్సును తీసుకొని వెళ్లి ఆధ్యాత్మికహృదయంలో ఉంచాలి, అదే ఉపాసన, అదేసాధన. నేను శరణాగతి చేసాను కాని నాకు దుఃఖంవస్తోంది ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. వాడునోటితో శరణాగతిపొందాను అని చెపుతున్నాడు కాని లోపల శరణాగతి పొందలేదు. దుఃఖంవచ్చేనేను ఎవరు అని భగవాన్ అడుగుతున్నారు. ఈ నేనునే కదా శరణాగతి చేయాలి మరి ఎవరిని శరణాగతిచేసావు. నీ శరణాగతి నిజమైతే ఈ నేను హృదయంలో అణిగిపోతుంది. ఈ నేను ఎక్కడైతే ఉదయించి వచ్చిందో అక్కడ అణిగితే అప్పుడు నీవు సుఖపడతావు. ఈప్రపంచం యొక్క కథఅంతా, నీ అహంకారం యొక్క కథ అంతా హృదయంలోనుండి బయలుదేరుతుంది. హృదయంలోనుండి మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక లోకం వస్తోంది, లోకం వచ్చాక దేవుడు వస్తున్నాడు. శరణాగతిమార్గంలో కాని, విచారణామార్గంలోకాని, నీవు ఏదో ఒకమార్గంలో ప్రయాణంచేసి నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచగలిగితే పంచదారబొమ్మను నీటిలో వేస్తే ఎలా కరిగిపోతుందో అలాగ నీ మనస్సు హృదయంలో కరిగిపోయి, హృదయంలో లయమయిపోతుంది. అప్పుడు అక్కడ ఉన్న బ్రహ్మంనీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. దేవుడు మనిషిని కల్పించాడా, మనిషిదేవుడిని కల్పించాడా అని అడుగుతున్నారు. వాడు వీడిని కల్పించలేదు, వీడు వాడిని కల్పించలేదు, ఈరెండూవ్యవహారికసత్యాలు. మీరు రాముడికి భక్తులు అయినా కృష్ణుడికి భక్తులు అయినా, ఏసుక్రీస్తుకు భక్తులయినా, అల్లాకు భక్తులయినా మీరు ఏకులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా మీరు ప్రకృతిగుణాలను అతిక్రమించకపోతే, జీవలక్షణాలను అతిక్రమించకపోతే జననమరణచక్రం నుండి విడుదలపొందలేరు. మోక్షాన్నిపొందలేరు. ఏదైతే సత్యమో అదేజ్ఞానం, ఏదైతే జ్ఞానమో అదే ఆనందం, ఏదైతేఆనందమో అదే అనంతం, అది నీ హృదయంలోనే ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకో. ఈ శరీరం ఉండగానే ఎవడైతే జీవలక్షణాలను తొలగించుకొన్నాడో, ఎప్పుడైతే అహంకారం, మమకారంల నుండి విడుదలపొందాడో అప్పుడు జీవుడు



అంటూలేడు, అంతానువ్వే ఉంటావు. అంతటానీవే ఉన్నప్పుడు ఇంకరాకలేదు, పోకలేదు, అదే నిర్వాణస్థితి. అటువంటి నిర్వాణస్థితిని పొందటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అని బుద్ధుడు చెప్పాడు. నీకు జ్ఞానసముపార్జనకు దారి చూపించే తల్లే తల్లి, నిన్ను తరింపచేయటానికి మార్గంచూపించే తండ్రే తండ్రి అని ప్రహ్లాదుడు చెప్పాడు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 08-08-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడి యొక్క అవతారములలో శివుడు, కృష్ణుడు ఇవి రెండూ ముఖ్యమైనవి. ఈ రెండు అవతారములు స్వయంభువు అంటే వారంతట వారేవ్యక్తమయ్యారు. దేవుడికి కారణం ఏమిటి అంటారు, దేవుడికి కారణం ఉంటే ఆయనదేవుడు అవ్వడు. అన్ని కారణాలకు కారణమే దేవుడు. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినది ప్రాక్టికాలిటీ. చేతిలో ఉన్నపనిని విడిచిపెట్టిపారిపొమ్మని, జీవితాన్ని విడిచిపెట్టి పారిపొమ్మని ఆయన ఎక్కడా చెప్పలేదు. జీవితంలో మనకు మంచి ఎదురవుతుంది, చెడు ఎదురవుతుంది. ఎన్ని ఎదురైనప్పటికి వాటిని పేస్ చెయ్యండి, అంతేగాని వాటినుండి పారిపోవద్దు అని భగవంతుడుచెప్పాడు. ఇది అంతా కాలక్షేపంకోసం కాదు, జీవితంలో మీకువచ్చే కష్టసుఖాలను ఎదుర్కొనేశక్తిని మీరు అలవాటు చేసుకోవాలి. ఏఈశ్వరుడు అయితే మనబుద్ధికి సాక్షిగా ఉన్నాడో ఆయనే కృష్ణరూపం ధరించాడు. జీవితాన్ని అనేకకోణాలనుండి పరిశీలించి ఆయన ఈమాటలు చెప్పాడు. ప్రతీ మనిషికి జీవితంలో ఒకోసారిలాభం, ఒకోసారి నష్టంవస్తుంది. ఒకోసారి అదృష్టం, ఒకోసారి దురదృష్టం వెంటాడుతుంది. జీవితంలో ద్వంద్వాలు ఉంటాయి, వీటిని చూచి నీవు కంగారుపడవద్దు. ఈద్వంద్వాలను అర్థంచేసుకొని, వీటిని ఆధారంగా చేసుకొని నిన్ను నీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి అని భగవంతుడు చెప్పాడు. మనకు జయం వస్తే పొంగిపోతున్నాము అనుకోండి, అపజయం వస్తే కుంగిపోతున్నాము అనుకోండి మనలను మనం తెలుసుకొనే అవకాశంరాదు. పనిపట్ల కర్తృత్వభావన ఉండకూడదు. కొంతమంది పుణ్యం వస్తుంది అంటే పనిచేస్తారు లేకపోతే చేయరుఅలాకాదు. అది మంచిపని అనుకొంటే చెయ్యి దానివలన పుణ్యం రావచ్చు, రాకపోవచ్చు, నేను ఆపని చేసాను, ఈపని చేసాను ఇలా అనుకోవటం మానివెయ్యి, ఇలా అనుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. జీవితంలో వచ్చే సంఘటనల నుండి పారిపోవద్దు, ఆసంఘటనలను అర్థంచేసుకొంటే నిన్ను నీవు తెలుసుకోవటానికి ఆసంఘటనలు ఉపయోగపడతాయి. నన్ను తెలుసుకో అని కృష్ణుడు చెపుతూఉంటాడు, అక్కడ నన్ను

తెలుసుకోవటం అంటే మోక్షాన్నిపొందటం. మోక్షంపొందితే భగవంతుడు ఏమిటో మనకు తెలుస్తుంది. మనం మోక్షం పొందటానికి సామాగ్రిలో దయ ఒకటి. బుద్ధుడు ఒకసారి మీకు నాలుగు మంచిమాటలు చెపుతాను వినండి అని అంటూ దయ అనే మాటనే నాలుగుసార్లు చెప్పాడు. మనస్సులో హింసాప్రవృత్తి ఉంటే నిన్ను నీవు తెలుసుకోలేవు. ఇతరులను శారీరకంగా, మానసికంగా హింసపెట్టటం వలన నీవు జపంచేసినా, ధ్యానంచేసినా నీకు ఆత్మజ్ఞానంరాదు. కర్మఫలం పట్ల ఆసక్తి లేకుండా పనిచెయ్యి. నీకు వచ్చినదానితో సంతృప్తిపడు. అదిరాలేదు, ఇది రాలేదు అని మానసికఆరోగ్యం పాడుచేసుకోవద్దు. అనుకరణపనికిరాదు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని ఇష్టంగా, ప్రేమగాచేస్తే వాసనాక్షయం అవుతుంది. ఫలితంపట్ల ఆసక్తి పెట్టుకొంటే ఏకాగ్రత, పవిత్రత, ప్రవీణత తగ్గిపోతుంది. మీరు అనుకోవటం వలన ఎక్కువరాదు, అనుకోకపోవటం వలన తక్కువరాదు. భగవంతుడు ఎంతకేటాయించాడో అంతే వస్తుంది. మనకు ఈశ్వరుడి పట్ల ప్రేమ ఉంటే, భక్తిఉంటే చాలా సమస్యలు పరిష్కారం అయిపోతాయి. జపంచేసి, ధ్యానంచేసి మనం ఏబలహీనతలు తొలగించుకోవాలను కొంటున్నామో ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగిఉండటంవలన మనకు తెలియకుండానే ఆ బలహీనతలు అన్నీపోతాయి. అంటే ఈశ్వరుని యందు భక్తి కలిగిఉంటే, ఆయనను ప్రేమిస్తూఉంటే మనకు తెలియకుండానే జపఫలితం, ధ్యానఫలితం వచ్చేస్తుంది. ఏవిషయాలయితే మన మనస్సును పీడిస్తున్నాయో వాటిలోనుండి మనం విడుదలపొందుతాము. భగవంతుడు ఒక్కడే. ఆయననే కొంతమంది రామ్ అంటున్నారు, కొంతమంది అల్లా అంటున్నారు, కొంతమంది యెహోవా అంటున్నారు, ఏపేరుపెట్టి పిలిచిన ఉన్నవస్తువు ఒక్కటే, అది మనహృదయంలోనే ఉంది. అది మనదేహంకంటే, మనస్సుకంటే, ఇంద్రియాల కంటే మనకు అతిసమీపంలో ఉన్నప్పటికి దేహబుద్ధివలన, అజ్ఞానం వలన ఎక్కడో మనకు దూరంగా ఉంది అని మనకు అనిపిస్తోంది. లోపలఉన్న వస్తువును తెలుసుకోవటానికి కొంతమంది సన్యాసంపుచ్చుకొంటున్నారు. సన్యాసం ఎందుకంటే వైరాగ్యం పెంచుకోవటానికే, సన్యాసంపుచ్చుకొని వాడు వైరాగ్యం పెంచుకోకపోతే వాడు గృహస్థుడితో సమానమే. వైరాగ్యం అత్యంత ముఖ్యం, వైరాగ్యం వలన మనస్సుకు లోచూపుకలుగుతుంది. సేవాభావం కలుగుతుంది, త్యాగబుద్ధి కలుగుతుంది. మనకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి అంటే మనకు ఉండవలసినంత వైరాగ్యంలేదు అని అర్ధం. మన మనస్సులో చాలా మాయపొరలు ఉంటాయి, వాటి నన్నింటిని చీల్చుకొంటూ రావాలి. ఆపొరలన్నింటిని



చీల్చుకొంటూ వస్తే గాని వాడు గుణాతీతుడు అవ్వలేడు. సైన్సు కేవలం దేహానికి కంపర్టు తీసుకొనివస్తుంది కాని మతం అలా కాదు మనకు శాంతిని తీసుకొనివస్తుంది. మనం పూజలు చేయటం, స్నానాలు చేయటం, ప్రార్ధనలు చేయటం, గుడికి వెళ్లటం అదేమతంకాదు. ఇవి అన్నీ వూరికే మామిడిపండుపైన ఉన్న తొక్కలవంటివిఅంతే. మతంలో ఉన్న రసంవేరుగా ఉంది, అది జ్ఞానం. అక్కడకువెళితే మనకు సమానబుద్ధి కలుగుతుంది. మనం రసాన్ని వదిలేసి, గుంజును వదిలేసి పైన ఉన్న తొక్కనుపట్టుకొని తిరుగుతున్నాము. మనకు అశాంతి ఎందుకు వస్తోంది అంటే ఉన్నదానియందు అదిలేదు అనే బుద్దిమనకు ఉంది అందుచేతనే మనకు దుఃఖంవస్తోంది, అశాంతివస్తోంది. భగవంతుడు ఉన్నాడుఅని మనం నోటితో చెపుతున్నాము. భగవంతుడు ఉన్నాడు అని నిజంగా మనకు నమ్మకంకలుగుతోంది అనుకోండి ఆయన వాక్యంనందు మనకు గౌరవంకలగాలి మనకు గౌరవం కలగటంలేదు అంటే మనం ఆయనను నమ్మటంలేదు, నమ్మినట్లుగా నటిస్తున్నాము. మనకు అశాంతి రావటానికి కారణం ఏమిటి అంటే ఏదైతే ఉందో దాని మీద లేదు అనే బుద్ధి మనకు ఉంది, ఏదైతే లేదో అది ఎంత స్పష్టంగా లేదో అంతగట్టిగా అదిఉంది అనుకొంటున్నాము. అంటే ఆత్మయందు అనాత్మబుద్ది, అనాత్మయందు ఆత్మబుద్ధి ఉంది, ఇక్కడే తిరకాసు వస్తోంది, ఇక్కడనుండే దుఃఖం ప్రారంభమవుతోంది, వేదన, రోధన, అశాంతి ప్రారంభమవుతోంది. అసలు పుండుఅంతా ఇక్కడే ఉంది. నీకు లేనిది లేనట్లుగా తెలిస్తే గాని ఉన్నది ఉన్నట్లుగా తెలియదు. లేనిది లేనట్లుగా తెలియాలంటే వైరాగ్యం లేకుండా ఎవరికి తెలియదు. పూజ, జపం ఇవి అన్నీ మైంటెనెన్స్‌డోస్‌ల వంటివి, తాత్కాలికంగా శాంతిని కలుగజేస్తాయి. మనం పూజచేస్తున్నాము అనుకోండి, జపం చేస్తున్నాము అనుకోండి, అప్పుడు ఇతర తలంపులురావు. జపం అయిన వెంటనే మరల తలంపులు వచ్చేస్తాయి, ఇవిఅన్నీ తాత్కాలికములు. నీవు శాశ్వతంగా దుఃఖంలోనుండి, అశాంతిలోనుండి విడుదలపొందాలంటే ఉన్నది ఉన్నట్లుగా మనకు స్పష్టంగా వ్యక్తమవ్వాలి. ఇప్పుడు మనకు నేను అనేటప్పటికి దేహం ఎలా స్ఫురిస్తోందో అలాగ మనకు నేను అనేటప్పటికి లోపలఉన్న సత్యవస్తువు మనకు స్ఫురించాలి. శత్రువులపట్ల, మిత్రుల పట్ల నీకు సమానబుద్ధిలేదు అనుకో నీమనస్సులోపలకు వెళ్లదు. మీకు శత్రువులు ఎవరైనా ఉన్నారాఅని ఒకరు భగవాన్‌ను అడిగితే శత్రువులు లేరు అని చెప్పి వూరుకోలేదు నాకు మిత్రులు కూడా ఎవరూలేరు అని చెప్పారు అంటే ఉన్నదిబ్రహ్మం, అదితానై ఉన్నాడు. నీకు బాహ్యంగాకొంతమంది మిత్రులుగా, కొంతమంది శుత్రువులుగా కనిపిస్తున్నప్పటికీ వాటిని బేలెన్స్ చేసుకో. ఆ బేలెన్స్‌చేసుకొనే బుద్ధి నిన్ను నీవు తెలుసుకోవటానికి సహకరిస్తుంది.

లోపలఉన్న వస్తువు మనకు తెలియకపోవటానికి కారణం నేను అనే తలంపు, అదే మొదటిపొర. ఈ నేను అనేతలంపు మనంకానిదానితో తాదాప్యంపొందుతుంది. మనకు వచ్చే ప్రతీతలంపుకు భగవంతుడు సాక్షిగాఉంటాడు. ఈజన్మలో మనకు ఏదైనా వ్యతిరేకమైన సంఘటనలు జరుగుతూఉంటే ఈశ్వరుడిని నిందించవచ్చు. మనం చేసినదే మనకు ఎదురువస్తుంది గాని మనం చేయనది ఏదీమనకు రాదు. అందుచేత అందులోనుండి పాఠాలు నేర్చుకొని, వాటిని మరల రిపీట్ చెయ్యకుండా ఉంటే ఈశ్వరునిదయకు పాత్రులవుతాము. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం ఇవి నాలుగు హిందుధర్మంలో చెపుతారు. వీటిలో మీరు ఎవరు అని భగవాన్‌ను ఒక ప్లీడరుగారు అడిగారు. భగవాన్ ఏమి చెప్పారుఅంటే ఇవి నాలుగు కాదు, వీటికి అతీతంగా ఉన్నాను, ఇవినాలుగు దానిలో ఇమిడి ఉన్నాయి. దానినే తురీయావస్థ అంటారు. మనకు మొదట నేను అనే తలంపువస్తుంది, ఇది వచ్చాకనాది అనే తలంపువస్తుంది. ఈ రెండూ తలంపులే, లోపలఉన్నసత్యవస్తువుకు తలంపులులేవు, వారు ఉంటారు అంతే. వారు అలాగ అనుకోరు, ఇలాగ అనుకోరు. మేము చెడ్డవారము, మేము మంచివారము అనుకొనేది అహంకారము. ఇలా అనుకొంటూ ఉంటే బంధంలో పడతాము, ఈ నేను, నాది అనే ఈ రెండుతలంపుల నుండి ఎవడైతే శేషంలేకుండా విడుదలపొందుతాడో వాడికి పరిపూర్ణమైనశాంతి వస్తుంది, అదే మోక్షం. మనకు తలనొప్పి వస్తోంది అనుకోండి లోపల ఏదో తేడా ఉంది అనిఅర్థం. అలాగే మీ మనస్సులో బాధవస్తోంది అనుకోండి లోపల ఏదో బలహీనత ఉందనిఅర్థం, లోపల ఏదోపాపం ఉందని అర్థం. మనకు ఆరోగ్యం బాగుంది అనుకోండి శరీరంలోని ఏ అవయవం మనకు గుర్తుకు రాదు. అలాగే మనం పరిపూర్ణమైనశాంతిలో ఉన్నాము అనుకోండి, సుఖంలో ఉన్నాము అనుకోండి అసలు లోకం ఉందనికాని, శరీరంఉందనికాని, మనస్సు ఉందిఅనికాని గుర్తుకురాదు, దేహం చనిపోతోంది అనుకోండి వాడికి ఏమీ అనిపించదు, ఎందుచేతనంటే అప్పటికే వాడు దేహంలోనుండి విడిపోయిఉంటాడు. మనం సాధన అనేది ఇక్కడే, ఈ భూమి మీద ఉండగానే చేయాలి, మనంపొందేది ఇక్కడే పొందాలి. మరణించిన తరువాత ఏదోపొందుతాము అని ఎవరైనా చెప్పినా మీరు నమ్మనక్కరలేదు. మనస్సు, మాట ఏకంగా ఉండాలి, నిర్మలంగా ఉండాలి. మనస్సు, వాక్కు నిర్మలం అవ్వకపోతే, ఈ రెండూ అణగకపోతే నువ్వు సాధన చేసినా నీకు ఆత్మజ్ఞానంరాదు. కొంతమంది పూర్వజన్మ పుణ్యంవలన పని నిరాడంబరంగా, నిర్మలంగా చేస్తారు. వారి చేతలోగాని, వారి ముఖంలో గాని అసలు ఆడంబరం కనబడదు. పవిత్రుడైనవాడు చేసేపని



ప్రశాంతంగా చేసుకొనిపోతాడు, ఇతరులు గుర్తించాలని అనుకోడు. ఎందుచేతనంటే ఆత్మకు ఇతరులులేరు, అహంకారానికి ఇతరులు ఉన్నారు. ఆత్మ గుర్తింపుకోరుతుంది, అహంకారం గుర్తింపుకోరదు. మనం గుర్తింపు కోరుతున్నాము అనుకోండి లోపల అహంకారంఉందని గుర్తు. మనకు హద్దులు తీసుకొని వచ్చేది, దుఃఖాన్ని తీసుకొని వచ్చేది ఈ నేను అనేతలంపు. దానికి వెళ్ళే అహారాన్ని కట్‌చేయాలి. జయాపజయాలను, లాభనష్టములను సమానంగా చూసుకోవాలి. ఇలా సమానంగా చూసుకోవటం నేర్చుకొంటే ఈ నేను అనేతలంపుకు వెళ్ళే అహారం తగ్గిపోతుంది. ఎప్పుడైతే దానికి వెళ్ళే ఆహారం తగ్గిపోయిందో అప్పుడు, అది ఎక్కడ నుంచి ఉదయించి వచ్చిందో అక్కడకు నెమ్మదిగా జారిపోతుంది. భగవంతుడికి ఇష్టమైన పనులు చేయండి ఎందుచేతనంటే ఆయనకు సంతోషం కలిగితేనేగాని ఈ దేహగతమైన నేనులోపలకు విత్‌డ్రా అవ్వదు. నాకు సంతోషం కలిగించేపనులు చేయండి, నాకు ఇష్టమైన పనులు చేయండి, నాదయకు పాత్రులవ్వండి, అప్పుడు నా స్వరూపం మీకు దొరుకుతుంది అని భగవంతుడు చెప్పాడు. మనిషిచేస్తే పాపం వచ్చేపనులు చేస్తాడు లేకపోతే పుణ్యం వచ్చేపనులుచేస్తాడు. భగవంతుడి దయను పొందటంకోసం ఎవరూ పనిచేయటంలేదు. ఆయన దయకోసం పనిచేస్తున్నాము అని మనం అనుకొంటున్నాము, ఇలా భగవంతుడిని ఎక్కడ మోసం చేయగలము. జయము, అపజయం అనేవి ఇప్పుడు మనం చేసే దానిని బట్టిలేదు, పూర్వజన్మల మీద ఆధారపడి ఉంటుంది. అది మనకళ్ళకు కనబడదు. భగవంతుడు మన కళ్ళకు కనబడడు. భగవంతుడు మనకళ్ళకు కనబడటంలేదు అని ఆయన లేడుఅని అనుకోవద్దు. అదృష్టం, దురదృష్టం కూడా మన మనస్సుకు అందదు. అదృష్టరూపంలో ఉన్నవాడు. దురదృష్టరూపంలో ఉన్నవాడు కూడా భగవంతుడే అదిమన గుర్తింపుకు అందటంలేదు. కొన్ని పనులు మనం ఇష్టం మీద చేస్తాము, మనకు ఇష్టంలేనివారు ఏదైనా పనిచేస్తూ ఉంటే దానిని చెడగొట్టటానికి కొన్నిపనులు చేస్తాము, ఇలా ఇష్టంతోనో, అయిష్టంతోనో పనులు చేస్తాము. కోడలు మీద అయిష్టంఉంది అనుకోండి కోడలు మంచి పనులు చేస్తున్నా దానికి అడ్డంపడతారు. అంతేగాని ఎవరకి భగవంతుడు అక్కరలేదు. భగవంతుడు దయకోసం పనిచేసేవాడు భక్తుడు. మనహృదయంలో ఒక సత్యంఉంది. అదే జ్ఞానం, అదే ఆనందం, అదే శాంతి, అదే సర్వస్వం. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని పొందకుండా అది చేసాను, ఇది చేసాను అంటే అవి అన్నీ ఒకటిలేని సున్నలతో సమానము. నీ ఇల్లు మెయిన్‌టెనెన్స్ కోసం ఇతరులమీద ఆధారపడవద్దు. నీ పనిఏదో నీవు చేసుకొంటూ మిగతా కాలాన్ని అంతా సత్యసాక్షాత్కారం

పొందటానికి ఉపయోగించుకో. అన్నింటికంటే విలువైనదికాలం. డబ్బుపెట్టి బజారులో ఉన్న వస్తువులను కొనగలము గాని కాలాన్ని కొనలేము. ఇప్పుడు మనకు 50 సంవత్సరాలు అనుకోండి, 30వ సంవత్సరం వస్తే బాగుండును అనుకొంటాము అనుకోండి, 30వ సంవత్సరం రాదు. జరిగిపోయిన కాలం తిరిగిరాదు. మనకు మరణసమయం వచ్చింది అనుకోండి, నేను నారాయణ స్మరణం చేసుకొంటాను ఇంకోగంట టైము ఇవ్వండి అంటే ఇవ్వడు. ఈ శరీరం చనిపోయిన తరువాత మీరు చేసేది ఏమీలేదు. మీరు పుణ్యకర్మలు చేసి ఉంటే పుణ్యలోకాలకు, పాపకర్మలు చేసి ఉంటే పాపలోకాలకు వెడతారు. అక్కడ అది అనుభవించాక మరల శరీరంధరించాలి ఈ భూమి మీదకు రావలసిందే, ఇక్కడ సాధన చేయవలసిందే. ఈ శరీరానికి మరణంరాకముందే మనం ఆత్మానుభవం పొందాలి, ఇప్పుడు నీవు శరీరంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ లోపల ఉన్నసత్యంతో తాదాప్యం ఈ శరీరం ఉండగానే రావాలి. లోపలఉన్న వస్తువు మనకు అత్యంత సమీపంగా ఉన్నప్పటికి మనకు అనాత్మయందు ఆత్మబుద్ధి ఉండటంవలన, ఆత్మయందు అనాత్మబుద్ధి కలిగిఉండటంవలన అది మనకు తెలియటంలేదు. మనం సాధన చేస్తూఉండాలి. ఆత్మానుగ్రహం వచ్చేవరకు వెయిట్ చేయాలి. మనం చేసేసాధన తక్కువ, అక్కడ నుండి వచ్చేది ఎక్కువ. నీలోపల సద్వస్తువుఉంది, అది నిన్ను కరుణిస్తుంది, నీవు తొందరపడవద్దు. కంగారుపడి నీవు ప్రయాణించేమార్గం మార్చవద్దు. నీవు ప్రయాణించే మార్గంమీద నీకు విశ్వాసం ఉండాలి, స్థిరత్వం ఉండాలి. నువ్వు నీ మనస్సును ఇస్తున్నావోలేదో భగవంతుడు చూసుకొంటాడు. జీవుడు ఏదోకుప్పిగంతులు వేసినప్పటికి శక్తి ఈశ్వరుడిది, జీవుడికి శక్తిలేదు. ఎప్పటికైనా ఆత్మయొక్క దయలేకుండా నీవు దానిని పొందలేవు. ఇతరులను అనుకరించవద్దు. నీవు చేసేసాధన సిన్సియర్‌గాచెయ్యి. ఆడంబరజీవితంవద్దు. ఆడంబరజీవితంవలన అప్పులు మిగులుతాయి. నీవు సాధన చేస్తూఉంటే లోపల ఉన్న ఈశ్వరునియొక్క దయనీకు కలగటం, ఆయన నీకు వ్యక్తంకావటం ఒకేసారి జరిగిపోతుంది. ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు. ఓపిచ్చివాడా! నేను ఆకాశం వంక చూడను అంటావు అనుకో ఆయన లేకుండాపోడు. అలాగే మనలోపల జ్ఞానసూర్యుడు ఉన్నాడు. నేను లోపలకు చూడను అంటావు అనుకో ఆయన లేకుండా పోతాడా? లోపలజ్ఞానం ఉంది, అనుగ్రహంఉంది. మీకు ఎప్పుడైనా కష్టంవచ్చింది అనుకోండి, ఆకష్టం ద్వారా మీమనస్సును సమాయత్తం చేయటానికి, మీ బుద్ధిని తయారుచేయటానికి ఆ కష్టాన్ని పంపించాడు కాని మీ మీద ఇష్టం లేకకాదు. ఈశ్వరుడు దయాస్వరూపుడు, ప్రేమస్వరూపుడు,



అనుగ్రహస్వరూపుడు. శక్తి ఈశ్వరుడిదే కాబట్టి ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. కంగారుపడవద్దు, సాధన విడిచిపెట్టవద్దు. ఈశరీరం ఉండగానే ఆయన మీకు వ్యక్తమవుతాడు. లోపల ఉన్నవస్తువుతాలుక ఎరుకకొంచం నీకు కలుగుతూఉంటే, ఆత్మానుభవాన్ని మీ మనస్సు కొంచం రుచిచూస్తే మీ మీనస్సు అటుమళ్ళింపబడుతుంది. అప్పుడు విషయచింతన తగ్గిపోతుంది, దేహవాసన తగ్గిపోతుంది, శాస్త్రవాసన తగ్గిపోతుంది. కంగారుపడవద్దు. కొంచం వెయిట్‌చేయండి, మీరు పొందేది ఏదో పొందుతారు. కాని మీ విశ్వాసం మాత్రం చలించకూడదు, మీరువెళ్ళే మార్గం తప్పకూడదు. నెమ్మదిగా వెళ్ళండి, గమ్యాన్ని మర్చిపోవద్దు. పరుగులుపెడుతూ వెళ్ళి గమ్యాన్ని మర్చిపోతే ఏమిటి ప్రయోజనం? మనం మద్రాసు వెళ్ళాలి అనుకొని పరుగులు పెట్టుకొని వెళ్ళి కలకత్తా వెళ్ళేరైలులో కూర్చొంటే పరుగులు పెట్టటం వలన ప్రయోజనం ఏమిటి? మా మనస్సు చలిస్తోంది, ఆగమంటే ఆగటం లేదు అని భగవాన్‌తో అంటే మీ మనస్సు ఆగమంటున్నారు, అది ఆగటంలేదు, నా మనస్సును చలించమంటున్నాను, అది చలించటంలేదు అన్నారు భగవాన్. మీకు దృశ్యం ఉన్నప్పుడే మనస్సు చలిస్తుంది. విషయచింతన ఉన్నవాడికే మనస్సు చలిస్తుంది, విషయచింతన లేనివాడికి మనస్సు చలించదు, ఒకవేళ మనస్సు చలిస్తోంది అనుకోండి, కంగారు పడనక్కరలేదు. ఏకారణం వలన అది చలిస్తోందో చూసుకోవాలి. ఆకారణాన్ని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. మన ప్రయత్నమే ఈశ్వరుని కృపకింద మారుతుంది, ఆకారణం నశిస్తుంది. ఈశ్వరుని దయ మన మీద పనిచేస్తున్నప్పుడు జీవలక్షణాలు అన్నీ ఒక్కొక్కటిగా ఊడిపోతాయి, అప్పుడు లోపలఉన్న వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. జీవలక్షణాలను కేవలం నీ తెలివితేటల వలన పోగొట్టుకో లేవు. దానికి ఆత్మయొక్క శక్తి ఉండాలి. ఆత్మశక్తి వలననే జీవలక్షణాలు నశిస్తాయి. మీరు తల్లిదగ్గరకు వెళ్ళారు అనుకోండి, తల్లి బట్టలు పెడుతుంది, సారిపెడుతుంది, డబ్బులు ఇస్తుంది. మరి తల్లిఇంత చేసినప్పుడు మీరు కూడా తల్లిని ప్రేమించాలికదా. తల్లి ఎంతపెట్టిందో అంతనీవు తిరిగి పెట్టకపోయినా అమ్మఇంత పెడుతోంది అని కనీసం తల్లిపట్ల కృతజ్ఞతకలిగి ఉండాలికదా. అలాగే నీలోపల ఉన్న ఈశ్వరుడు నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని తొలగించటానికి ప్రయత్నం చేస్తున్నాడు, ఆయనచేసే ప్రయత్నానికి కనీసం నీవు సహకరించాలికదా అంటున్నారు భగవాన్. తల్లి ప్రేమకంటే ఎక్కువప్రేమ భగవంతుడుకి జీవుడిపట్ల ఉంటుంది. భగవంతుడు తనలో ఐక్యం చేసుకోవటానికి చూస్తాడు, దానికి అడ్డురాకుండా సహకరించండి సరిపోతుంది, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుడి సంకల్పాన్ని

ఎవడైతే గౌరవిస్తున్నాడో వాడికి మాత్రమే అహంకారం నశిస్తుంది. సోక్రటీసును విషంపెట్టిచంపారు, గాంధీగారిని కాల్చిచంపారు, ఏసుక్రీస్తును శిలువవేసి చంపారు ఎందుచేతనంటే వారి మంచితనాన్ని భరించలేక అలాచంపారు. మనకంటే ఎక్కువ మంచి తనం ఉన్నవారిని మనం భరించలేము. మీరు అందరికి సహకారం చేయలేకపోవచ్చు. అందరూ బాగుపడాలి అనే బుద్ధి కలిగి ఉండటంలో, ఆతలంపుకలిగి ఉండటంలో దారిద్ర్యం ఎందుకు. మీరు ఏదైతే పొందుదామనుకొంటున్నారో అది ఇంకా రాలేదు ఏమిటి అని అనుకోవద్దు. అలా అనుకొంటూఉంటే మీలో ఏదో దోషం ఉన్నట్లు గుర్తు. మీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయండి. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. ఆయన చేసేపనికి మీరు ఏమీ జ్ఞాపకం చేయనక్కరలేదు. మరుపు, జ్ఞాపకం అనేది జీవుడికి సంబంధించినవి. మరుపు, జ్ఞాపకానికి అతీతుడు ఈశ్వరుడు. మీరు పెంచుకొన్న దానిలో కొంచం ఇతరులతో పంచుకోండి. మీకు విద్యఉన్నా, గౌరవం ఉన్నా, ధనం ఉన్నా దానిని కొంచం ఇతరులతో పంచుకోండి. మీరు ఏదైతే పెంచుకొన్నారో దానిని ఇతరులకు పంచటం వలన భగవంతునిదయకు పాత్రులవుతారు. జ్ఞానం రావటానికి ఇవిసహకరిస్తాయి, కాబట్టి భగవంతుడు చెయ్యమంటున్నాడు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం ఉంటే ఆయనకు శరణాగతి చెందు. ఆయన సంకల్పమే నా సంకల్పం, ఆయన ఇష్టమే నా ఇష్టం అనుకొంటూ జీవిస్తూ ఉంటే ఆయన మిగులుతాడు, మీరు పోతారు అంటే జీవుడు పోతాడు, ఈశ్వరుడు మిగులుతాడు. భగవంతుడు ఉన్నాడా, లేడా అనే అనుమానం నీకు కలుగుతూ ఉంటే నీకు నేను అనేతలంపు తెలుస్తోంది కదా దానిని పట్టుకొని దాని మూలంలోనికి వెళితే అదినశిస్తుంది, భగవంతుడు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానంలోనుండి బయటకు రావాలి. మీకు అశాంతి వస్తోంది అనుకోండి అశాంతి ఎందుకు వస్తోందో ఆకారణం తెలుసుకొని, ఆకారణాన్ని తొలగించుకోవటానికి మీరు ప్రయత్నంచేయకుండా ఏదో ప్రార్ధనలు చేస్తూఉంటే, తాత్కాలికంగా నీకు కొద్దిగా శాంతి రావచ్చు, అది మెయిన్‌టెనెన్స్ డోస్ మాత్రమే, దీని వలన నీవు శాశ్వతశాంతిని పొందలేవు. చాలామంది నాదగ్గరకు వచ్చి ఆనదులలో మునిగాము, ఆయాత్రలు చేసాము, జపాలు చేసాము, ధ్యానాలు చేసాము, యాగాలు చేసాము అని చెపుతున్నారు, అవి వింటున్నానుకాని వాటిమీద నాకు ఆకర్షణలేదు అన్నారు భగవాన్, ఎందుచేత తాను తానుగా ఉన్నాడు కాబట్టి ఆయనకు ఆకర్షణలేదు. అలాగని మిమ్మల్ని చేసుకోవద్దు అని ఆయన చెప్పటంలేదు. సాధన చెయ్యండి.



సాధనచెయ్యండి అందులో ఏదీలేదు అని తెలిసేవరకు సాధనచెయ్యండి యాత్రలు చెయ్యండి, యాత్రలు చెయ్యండి అక్కడ ఏమీ లేదు అని తెలిసేవరకు యాత్రలు చెయ్యండి. ఉన్నదంతా మీ హృదయంలోనే ఉంది నీవు పొందవలసింది ఇక్కడే ఉంది. ఈ దేహం శవం అవ్వకముందే దానిని పొందితే ఇంకనీకు ప్రయాణాలు ఉండవు, దానిని పొందకపోతే ప్రయాణాలు ఆగవు. దానిని ఇప్పుడే ఇక్కడే ఈ శరీరంలో ఉండగానే పొందు. అప్పుడు ఇంక ఈ దుఃఖాలయం లోనికి ప్రవేశించనక్కరలేదు. శరీరంలో ప్రవేశించామా దుఃఖం ప్రారంభమవుతుంది ఎందుచేతనంటే మనకు ఏ తలంపు వచ్చినా దానికి దేహంనేను అనే తలంపు కారణం అవుతుంది. దేహము నేను అనే తలంపునుండి వచ్చిన ఏతలంపు అయినా నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. దేహాభిమానం లేనివాడికి తలంపు వచ్చినా అదివాడిని బంధించదు, అదినీటిమీద గీతలాంటిది. మనం మోక్షంపొందేవరకు మనకు స్వతంత్రమైన సుఖం, శాంతి అనుభవంలోనికి రాదు. ఈ ఆవరణలోనుండి విడుదలపొందితే గాని నీకు నిజమైనశాంతి కలుగదు. ప్రతీ క్షణాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి, మనం కోటి రూపాయలు పెట్టి కొందామన్నా నిన్నటిరోజును కొనలేము. మనశరీరం చనిపోయేలోపు అదృష్టం వస్తుంది, దురదృష్టం వస్తుంది వాటి రూపంలో ఉన్నవాడు భగవంతుడే. ఇవి అన్నీ భగవంతుడు ఎందుకు పంపుతున్నాడు అంటే మనమీద ఇష్టంలేక కాదు, వాటిద్వారా మనకు పాఠాలు నేర్పి మనకు సమానబుద్ధిని కలుగచేయటం కోసం, శాంతచిత్తాన్ని కలుగచేయటం కోసం ఆ సంఘటనలు భగవంతుడు క్రియేట్ చేస్తున్నాడు. కొంతమందికి పుట్టింటిదగ్గర సుఖం ఉండదు, అత్తవారింటిదగ్గర సుఖం ఉండదు, ఎటుచూసినా కష్టాలే అయినా ప్రశాంతంగా ఉంటారు, భగవంతుడు వారిని స్వర్గరాజ్యంలో కూర్చోబెడతాడు. మనంనెత్తిమీద నీళ్ళుఎలా పోసుకుంటామో అలాగ జ్ఞానవర్షాన్ని వారినెత్తిమీద భగవంతుడు కురిపిస్తాడు. ఇన్ని కష్టాలమధ్యన, ఇంత క్షోభమధ్యన, ఇంత గోలమధ్యన, ఇంత అశాంతిమధ్యన వారు శాంతిసాగరంలో ఈదులాడుతూ ఉంటే వారు మోక్షాన్ని అడగనక్కరలేదు, భగవంతుడే వారి దగ్గరకు వచ్చి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. మీకు ఎటుచూసినా కష్టాలేకదా అని వారితో అంటే ఈకష్టాలు కూడ భగవంతుని పాదాలు విడిచిపెట్టకుండా ఉండటానికి సహకరిస్తున్నాయి కదా అంటారు. ఏదివచ్చినా పేస్‌చేయడానికి వారు రెడీగా ఉంటారు. కొంతమందికి చిన్నపనిచేసినా పెద్దఫలితం వస్తుంది. కొంతమందికి పెద్ద పనిచేసినా చిన్నఫలితం వస్తుంది.అది ఈశ్వరుని నిర్ణయం, ఈశ్వరుని నిర్ణయాన్ని మనం గౌరవించాలి, ఈశ్వరుని నిర్ణయాన్ని మనం ప్రసాదంగా స్వీకరించాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-09-2004 | సోమ | భీమవరం, శివరావు పేట, సరస్వతిగారి ఇంటివద్ద |
| 12-09-2004 | ఆది | మంచిలి హైస్కూల్ (అత్తిలి మండలం) |
| 16-09-2004 | గురు | వెంకటాపురం, చిన్నరామరాజుగారి ఇంటివద్ద |
| 23-09-2004 | గురు | సద్గురు శ్రీనాన్నగారి 71వ జన్మదిన మహోత్సవము శ్రీ రమణక్షేత్రం - జిన్నూరు |



# సద్గురు శ్రీ నాన్నగారి 71వ జన్మదిన మహోత్సవం

ఉ॥ గం. **6-00**ల నుండి

**సద్గురు దర్శనం**

ఉ॥ గం. **8-00**ల నుండి

**భగవాన్ పూజ - శ్రీ రమణక్షేత్రంలో**

ఉ॥ గం. **10-00** ల నుండి గం॥ **12-00** ల వరకు

**దూరప్రాంత భక్తులకు భోజనాలు**

మ॥ గం॥ **12-00** లకు

**శ్రీ నాన్నగారు రమణక్షేత్రమునకు విచ్చేయుదురు**

మ॥ గం॥ **2-00** లకు

**సద్గురువుకు కమిటీవారిచే సన్మానం**

మ॥ గం॥ **2-15** ని॥లకు

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**



**సునీల్ ఆర్థోపెడిక్ హాస్పటల్**

ఎముకల, కీళ్ళ, నరముల, వెన్నుముక, పోలియో, ఫిజియోథెరపీ సెంటర్

యస్.కె.బి.ఆర్. కాలేజ్‌వద్ద,

అమలాపురం ☎ 233373, 236373

డాక్టర్ పెన్మెత్స సునీల్ కుమార్, M.S. Ortho కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్



సద్గురు శ్రీనాన్నగారిని ఆహ్వానిస్తున్న, డా॥ సునీల్ కుమార్



కన్సల్టెన్సీ రూమ్‌లో సద్గురు శ్రీ నాన్నగారు